

హర్‌ ఘర్‌ తిరంగా

లకోరియా ప్రభుత్వ పాఠశాలలో..

అంబర్‌పేట: స్వాతంత్య్ర దినోత్సవ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని బీజేపీ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం అంబర్‌పేట సీపీఎల్‌ రోడ్‌ లకోరియా ప్రభుత్వ పాఠశాల ఏబీవీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య కిషన్‌రెడ్డితో కలిసి చిన్నారులకు జాతీయ జెండాను అందించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్‌గౌడ్‌, యశ్వంత్‌, నాగభూషణం చారి, భిక్షపతి, దయాకర్‌ యాదవ్‌, కృష్ణ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

23 కోట్ల ఇళ్లపై తిరంగా రెపరెపలు

కాచిగూడ: హర్‌ ఘర్‌ తిరంగా.. మనందరి బాధ్యత.! అని ఈ పండగలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బర్కత్‌పురలోని తన ఇంటి పైన కిషన్‌రెడ్డి తన సతిమణి కావ్యాకిషన్‌రెడ్డితో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. జాతీయ సమైఖ్యతను కాపాడటం మనందరి బాధ్యతని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కోరారు. ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు 15వరకు కొనసాగనుందని ఆయన తెలిపారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా 23 కోట్ల మంది భారతీయులు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు తిరంగా ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు.



బర్కత్‌పురలోని తన ఇంటిపై జెండాను ఎగురవేస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం బర్కత్‌పురలో మహిళలు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యా కిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు డా. గౌతంరావు హాజరై మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో మహిళల పాత్ర అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మిఆ, కార్పొరేటర్లు కన్నె ఉమా, వై.అమృత, పద్మ, ఎడెల్లి అజయ్‌, శ్యామ్‌రాజ్‌, జ్యోతి, నీరజ, రజిని తదితరులు పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ..

బర్కత్‌పురలో తిరంగా ర్యాలీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్య, మహిళా మోర్చా నాయకులు



దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ

కాచిగూడ: జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి అర్డినెన్స్‌ ద్వారా దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలుస్తామని చెప్పినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణపై సోమవారం నాయకులతో సమావేశం అయ్యారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేస్తేనే అన్ని కులాలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగాలలో న్యాయం జరుగుతుందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, మాదిగ ఎమ్మెల్యేలు వీటిని పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత మాదిగలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శిలారపు రాంచందర్‌, ప్రొ. ముత్తయ్య, ఇటిక్యాల పురుషోత్తం, ప్రొ. మల్లేష్‌, విజయ్‌కుమార్‌, బీఎస్‌ రమేష్‌, వెంకటయ్య, ఇటుక రాజు, చింత స్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి



కవాడిగూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాడి.. లక్ష్యాన్ని చేరుకొని తెలుగు నేలపై అడుగు పెడుతున్న ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నేత ఆడెపు నాగార్జున మాదిగ పిలుపునిచ్చారు.సోమవారం కవాడిగూడ డివిజన్‌ బీమా మైదానం రోటరీకాలనీ, సింగాడికుంట, కోండండరెడ్డినగర్‌, దేవీ ప్రసాద్‌బాగ్‌, ఎంసీహెచ్‌ క్వార్టర్స్‌ తదితర బస్తీలలో ఎమ్మార్పీఎస్‌ ముషీరాబాద్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్‌ మాదిగ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నేడు సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ నుంచి లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వరకు నిర్వహిస్తున్న ర్యాలీలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాదిగ సమాజంతో పాటు ప్రజాస్వామిక వాదులు, మేధావులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి కృష్ణమాదిగ, జానకీరామయ్య చౌదరి, మాడపు శ్రీనివాస్‌, చిలక ఎల్లయ్య, కలవల కుమార్‌, తిప్పారపు రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం లేకుండా సెక్యులరిజం ఉండదు

కాచిగూడ: రాజ్యాంగం, ప్రజాస్వామ్యం లేకుండా సెక్యులరిజం ఉనికిలో ఉండదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జిల్లా కార్యదర్శి ఎస్‌.ఛాయాదేవి అధ్యక్షతన సీపీఐ జిల్లా నిర్మాణ మహాసభలు జరిగాయి. బీజేపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యంతో పాటు మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సుశీల దేవి, పి.ప్రేమ్‌పావని, బి.వెంకటేశం, కమతం యాదగిరి, బి.స్టాలిన్‌, పడాల నళిని, శ్రీకాంత్‌, కంపల్లి శ్రీనివాస్‌, బొడ్డుపల్లి కిషన్‌ పాల్గొన్నారు.

అర్హత లేని రేడియోగ్రాఫర్లను విధుల నుంచి తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రేడియోగ్రాఫర్‌ సురేష్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అర్హత లేకుండా రేడియోగ్రాఫర్లుగా సేవలందిస్తున్న వారిని గుర్తించి సత్వరమే తొలగించాలని పలువురు రేడియోగ్రాఫర్స్‌ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మకు విజ్ఞప్తి చేశారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రేడియోగ్రాఫర్స్‌ సమస్యలపై సోమవారం రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేడియో గ్రాఫర్‌ సురేష్‌ మాట్లాడుతూ... పారా మెడికల్‌ బోర్డు గుర్తింపు లేకుండా డిప్లొమా ఇన్‌ మెడికల్‌ ఇమేజింగ్‌ టెక్నాలజీ లేని రేడియోగ్రాఫర్స్‌ కొందరు పలు ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారని అన్నారు. తాము కష్టపడి చదివి పట్టాపొందినా తమకు అన్యాయం జరుగుతోందన్నారు. ఫలితంగా రోగులకు సరైన సేవలు అందించడం లేదన్నారు. పదేళ్ల నుంచి సేవ చేస్తున్న తమకు కొత్తగా విధుల్లో చేరిన వారికి వేతనాల్లో వ్యత్యాసం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో విష్ణు, ఇందుశేఖర్‌, నవీన్‌కుమార్‌, తనీష్‌, అమర్‌ తదితరులు పాల్గొన్నారు.

సోషల్‌ వెల్ఫేర్‌ గురుకుల కార్యదర్శిని తొలగించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్‌

ముషీరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోషల్‌ వెల్ఫేర్‌ గురుకులాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని ఆ గురుకులాలకు రెగ్యులర్‌ ప్రిన్సిపల్స్‌ లేరని వెంటనే వాటిని నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్‌ చేశారు. సోమవారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దూర ప్రాంతాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు వస్తే కార్యదర్శి కనీసం కలవడానికి కూడా అవకాశం ఇచ్చే పరిస్థితి లేదన్నారు.

విద్యార్థులు అస్వస్థతకు గురైనా స్పందించని వైనం..

ఆగస్టు 9వ తేదీన జగిత్యాల జిల్లా మెట్టుపల్లి మండలం పెద్దపూర్‌ గురుకులంలో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురై ఓ విద్యార్థి మృతి చెందాడన్నారు. అలాగే ములుగు ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల 3వ అంతస్తు నుంచి ఓ బాలిక దూకడంతో కాళ్లు, చేతులు విరిగాయని తెలిపారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్‌ జిల్లా లింగాల గురుకులాల్లో ఓ విద్యార్థి ఫోన్‌ మాట్లాడినందుకు ప్రిన్సిపల్‌ చితకబాదడంతో ఆ విద్యార్థి ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. ఇంత జరుగుతున్నా గురుకులాల కార్యదర్శి స్పందించడం లేదని విమర్శించారు.

గురుకులాలను సందర్శించిన దాఖలాలు లేవు..

సూర్యాపేట సోషల్‌ వెల్ఫేర్‌ గురుకుల విద్యార్థులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరసనలో కూర్చుంటే కనీసం వారిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రతి చోట ఏదో ఒక రోజు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయని కానీ ఏ ఒక్క జిల్లాకు గురుకుల కార్యదర్శి వెళ్లడం లేదని ఆరోపించారు. సోషల్‌ వెల్ఫేర్‌ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లా పర్యటనకు, ఏ గురుకులాన్ని సందర్శించిన దాఖలాలు లేవన్నారు.

- ఆమె వచ్చినప్పటి నుంచి అక్రమ డిప్యూటేషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే కార్యదర్శిని తొలగించాలని డిమాండ్‌ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రణయ్‌, మంద నవీన్‌, ఎం.నాగరాజు, తీగల శ్యామ్‌, మామిడాళ్ల ప్రవీణ్‌, ఝాన్సీ, యశ్వంత్‌ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌ను నిర్మించేది యువతే..

స్టేట్‌ ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ కె.హైమావతి



అంతర్జాతీయ యువజన దినోత్సవంలో మాట్లాడుతున్న హైమావతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ భవిష్యత్‌ను నిర్మించేది యువతే అని యువత ఆరోగ్యంగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్‌ ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌ కె.హైమావతి అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్‌ కాలేజీ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు ఎయిడ్స్‌ రహిత సమాజ నిర్మాణం కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ.. ఎయిడ్స్‌ పట్ల యువత అవగాహన పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 180 ఎయిడ్స్‌ టెస్టింగ్‌, కౌన్సిలింగ్‌ సెంటర్లు, 29 మందుల పంపిణీ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఒకసారి హెచ్‌ఐవీ వస్తే జీవితాంతం వారిలో వైరస్‌ ఉంటుందన్నారు. అందుకే ఎయిడ్స్‌పై యువత అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తే అందులో 40 శాతం మంది యువత ఎయిడ్స్‌ వ్యాధికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్‌ నియంత్రణ సంస్థ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ తినపాటి ప్రసాద్‌, డిప్యూటీ డైరెక్టర్‌ రవికుమార్‌, జాయింట్‌ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవికుమార్‌, మేజర్‌ రాజేష్‌కుంద్రా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌-1, 2, 3 ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'ఎయిడ్స్‌ను నియంత్రించాలి.. యువత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి'అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్‌ ఎన్‌.రిషికాంత్‌ మాట్లాడుతూ.. యువత ఎయిడ్స్‌ పట్ల అవగాహన పెంచుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అంతే కాకుండా దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ మట్టా శేఖర్‌, కుమారస్వామి, ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డా. శ్రీధర్‌, ఉమెన్స్‌ వింగ్‌ ప్రతినిధి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ కళాశాలలో అవగాహన ర్యాలీ



గుర్తు తెలియని మృతదేహం లభ్యం



చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఏఎస్సై తిరుపతి పూజారి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్‌ స్టేడియం బస్టాప్‌ వద్ద సుమారు (55-60)ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు. మృతుడిని గుర్తిస్తే దోమలగూడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



నల్లకుంట: ఫుట్‌పాత్‌పై అపస్మారకస్థితిలో పడి ఉన్న వ్యక్తిని పోలీసులు గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందినట్లు నల్లకుంట పోలీసులు తెలిపారు. అడ్మిన్‌ ఎస్సై జె. శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం సమయంలో అడిక్‌మెట్‌ రోడ్డులోని ద్వారకా టిఫిన్‌ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి(45) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న సదరు వ్యక్తి ఈనెల 10న సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. మృతుడి బంధువులు, తెలిసిన వాళ్లు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని కోరారు.

గణేష్‌ మండపాల వద్ద భారీ భద్రత

కాచిగూడ: గణేష్‌ నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మండపాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కాచిగూడ ఏసీపీ వి.రఘు తెలిపారు. సోమవారం కాచిగూడ ఠాణాలో గణేష్‌ మండప నిర్వాహకులు, పీస్‌ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఉండాలన్నారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌ కె.చంద్రకుమార్‌, ఎస్సై సుభాష్‌, పీస్‌ కమిటీ ప్రతినిధులు ఎస్‌.శరత్‌ శ్యామ్‌, కన్నె రమేష్‌యాదవ్‌, అరవింద్‌, బాబన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాడాలి



వికలాంగుల వాయిస్‌ మాసపత్రిక సంచికను విడుదల చేస్తున్న ఉమర్‌కాంత్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని హెలన్‌ కెల్లర్‌ విద్యాసంస్థల అధినేత ఉమర్‌కాంత్‌ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో వికలాంగుల వాయిస్‌ మాస పత్రిక పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంచికను విడుదల చేశారు. ఉమర్‌కాంత్‌ మాట్లాడుతూ.. వికలాంగుల పట్ల సమాజం చిన్నచూపు చూస్తోందన్నారు. వికలాంగులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. పాలకుల విధానాలతో వారు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి వారి భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ జర్నలిస్టులు శ్రీనివాసులు, వికలాంగుల వాయిస్‌ మాస పత్రిక ఎడిటర్‌ ఎం.అడవయ్య, అసిస్టెంట్‌ ప్రొ. శ్రీధర్‌కుమార్‌, ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షులు కె.వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్‌ కార్మికులను రెగ్యులరైజ్‌ చేయాలి

కాచిగూడ: జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్‌ విభాగంలో 35ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్‌ చేయాలని జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ జేఏసీ కన్వీనర్‌ ఆకుల శ్రీనివాస్‌ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఔట్‌ సోర్సింగ్‌ కార్మికుల మద్దతుగా టీజేఎస్‌ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలి, మేయర్‌ విజయలక్ష్మిని కలిసి సమస్యలను వివరించారు. అనంతరం వారు వినతి పత్రం అందజేశారు. జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న కార్మికులను డీఆర్‌ఎఫ్‌లోకి పంపించారన్నారు. వారిని యథావిధిగా ట్రాన్స్‌పోర్టులోకి తీసుకోవాలని కోరారు. 15 సంవత్సరాలు నిండిన జీహెచ్‌ఎంసీ వాహనాలను యథావిధిగా ఫిట్నెస్‌ చేసి నడిపించాలన్నారు. కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్‌ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్‌ వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారమే..

మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఉజ్వల జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని మేయర్‌ గద్వాల విజయలక్ష్మి అన్నారు. డీవైఎఫ్‌ఐ హైదరాబాద్‌ నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం మేయర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా యువత జాగ్రత్తగా మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్‌, కార్యదర్శి అనగంటి వెంకటేష్‌, నగర అధ్యక్షుడు దామెర హస్మిబాబు, కార్యదర్శి ఎండీ జావీద్‌ తదితరులు పాల్గొన్నారు.

మాజీ అడ్వొకేట్‌ జనరల్‌ బీఎస్‌ ప్రసాద్‌కు పితృవియోగం

మాజీ మంత్రి కేటీఆర్‌ పరామర్శ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మాజీ అడ్వొకేట్‌ జనరల్‌ బి.ఎస్‌.ప్రసాద్‌కు పితృ వియోగం జరిగింది. బీఎస్‌.ప్రసాద్‌ తండ్రి బండ శ్రీహరి(92) జిల్లా సబార్డినేట్‌ జడ్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన భౌతికకాయాన్ని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, మాజీ మంత్రి కేటీఆర్‌, ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్‌, యువజన నాయకులు ముఠా జైసింహ, సీనియర్‌ నాయకులు ఎమ్మెన్‌ శ్రీనివాస్‌రావు, బీసీ కమిషన్‌ సభ్యులు సీహెచ్‌.ఉపేంద్ర, ఎం.దామోదర్‌రెడ్డి, కొంతం గోవర్ధన్‌రెడ్డి తదితరులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. బండా శ్రీహరి అంత్యక్రియలను అంబర్‌పేట శ్మశానవాటికలో నిర్వహించారు.



బండా శ్రీహరి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్‌, ముఠా గోపాల్‌

21న భారత్‌ బంద్‌ విజయవంతం చేయండి

మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్‌

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 21వ తేదీన నిర్వహించే భారత్‌ బంద్‌ను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్‌ పిలుపునిచ్చారు. సోమవారం బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చంటూ ఇటీవల తీర్పు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ఉన్న ఈ తీర్పుపై ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌ గాంధీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

కాచిగూడ: కలకత్తాలోని ఆర్‌.జి.కర్‌ మెడికల్‌ కాలేజీలో విధి నిర్వహణలో ఉన్న మహిళా వైద్యురాలిని అతి కిరాతకంగా హత్య చేసిన నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని ఆమ్‌ ఆద్మీ పార్టీ డాక్టర్స్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్‌ లక్ష్య నాయుడు డిమాండ్‌ చేశారు. ఆస్పత్రుల్లో మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు మహిళలకు భద్రత కల్పించాలని కోరారు.

బీసీలు ఐక్యంగా ఉంటేనే న్యాయం

ముషీరాబాద్‌: రాష్ట్రంలో 54 శాతంపైగా ఉన్న బీసీ కులస్తులు ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకులాభరణం కృష్ణమోహన్‌ అన్నారు. సోమవారం బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ సమ్మేళన సభ ముగింపు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనను ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్‌, బిజ్జి కనకేష్‌కుమార్‌ సన్మానించారు. ఆర్థికంగా ఉద్యోగ, రాజకీయ పరంగా న్యాయం జరగాలంటే ఐక్యంగా ఉండాలన్నారు. అప్పడే బీసీలకు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు.

భూదాన యజ్ఞ బోర్డును ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి: తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేము నరేందర్‌రెడ్డిని తన నివాసంలో తెలంగాణ భూదాన యజ్ఞ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్‌.శంకర్‌నాయక్‌ మాట్లాడుతూ.. బోర్డు ఏర్పాటు చేయాకపోవడంతో భూదాన భూములు అన్యాక్రాంతం అవతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు ఆయన తెలిపారు.

అభ్యాసంతోనే నిష్ణాతులు అవుతారు

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాజకుమారి

చిక్కడపల్లి: నిరంతర అభ్యాసంతోనే నిష్ణాతులు అవుతారని ఆ దిశగా కళాకారులు దృష్టి సారించాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాజకుమారి అన్నారు. సోమవారం రాత్రి మిమిక్రీ, ఆర్టిస్ట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో మిమిక్రీ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్‌ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు మిమిక్రీ కార్యక్రమాలను చేపట్టేందుకు ఒక హాలును ఉచితంగా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు చంద్రముఖి చంద్రశేఖర్‌, సంతోష్‌లను సన్మానించారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం

చిక్కడపల్లి: అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలో సోమవారం గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ జాతిపిత ఎస్‌ఆర్‌ రంగనాథన్‌ చిత్రపటానికి సంస్థ కార్యదర్శి పి.పద్మజ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌ రంగనాథన్‌ గ్రంథాలయాల్లో పుస్తక నిర్వాహణపై ఒక చట్టం తీసుకొచ్చారని తెలిపారు. అందుకే ఆయన జయంతి రోజున గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

రాజ్యసభ విప్‌ డా. కె.లక్ష్మణ్‌కు సన్మానం

చిక్కడపల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ రాజ్యసభ విప్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు రత్నసాయిచంద్‌ సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో నేతలు పీఎస్‌చారి, శ్రీకాంత్‌, సత్తిరెడ్డి, డీఎస్‌రెడ్డి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ చానల్‌లో మెస్‌ చార్జీలు చెల్లించాలి

కాచిగూడ: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల మెస్‌ చార్జీలు పెంచి గ్రీన్‌ చానల్‌ పద్ధతిలో చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బీసీ విద్యార్థులు సోమవారం బర్కత్‌పురలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థుల మెస్‌ చార్జీలను పెంచాలని కోరారు. రాష్ట్రంలో వివిధ కోర్సుల్లో చదువుతున్న 20 లక్షల బీసీ విద్యార్థుల మొత్తం రూ.7వేల కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు.

'జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యం వీడాలి'

కాచిగూడ: గ్రేటర్‌ హైదరాబాద్‌లో పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌, వైరల్‌ ఫీవర్లతో ప్రజలు అల్లాడిపోతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీవైఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్‌ ప్రదీప్‌ అన్నారు. సోమవారం పీవైఎల్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో చలో జీహెచ్‌ఎంసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మేయర్‌ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్‌ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేశారు.